# తాత కథ

ఎలికట్టె శంకర్ రావు



దసరా పండుగ.
తూర్పు బజారున కోడి
కూయకముందే ఊరు లేచింది.
అయ్యగారింట్ల, కోంటోల్లింట్ల
అరుగులాయనింట్ల, పటేలింట్ల,
ఊరు బయట సర్కారు ఇండ్లల్ల...
కరంటు బుగ్గలు వెలిగినయ్.
పొద్దు పొడిసే సరికి వాకిళ్లు
సాన్పినీళ్ళతో స్నానం చేసినయ్.
బారెడు పొద్దెక్కేసరికి ఊల్లె
మనుషులంతా తలారా స్నానం
చేసిండ్రు. తొంబయ్యేండ్ల తాత
మారెసరు ముంతోలిగున్న
తల్కాయమీద నాలుగు చెంబుల
నీల్లు పోసుకుండు. సుధాకరు
బల్లెపీటమీద ముసుగుతన్ని
పండుకుండు. అప్పటికే వాళ్ళమ్మ
లేపీ లేపీ అలిసిపోయింది. వాళ్ళ
నాయిన చూసీ లేపకండానే
బయటికి పోయిండు.

# కథ

ఊరు సంబూరంగా ఉంది. పొద్దుగాల లేచింది. ముత్తయిదోలిగ నవ్వుతున్నది. తాత కర్రదాపున బల్లెపీట కాడికొచ్చిండు. మనవని మీద చెయ్యేసి 'సుదాకరూ లేరా నాయినా లేరా' అన్నడు.

సుతారంగా మనవని పిర్రమీద రొండు దెబ్బలేసిండు.

సుధాకర్ నుసిలిండు. ముసుగు బిగదీసిండు.

తాత మనసు చివుక్కుమన్నది. నా మనవడి మనసు బాగలేకనే కదా పండుకుండు అనుకుండు. నిన్నటి నుంచి తాత మనసు కూడా బాగలేదు. సుధాకర్ ఒక్కడే రావడం బాగనిపించలే. బాధనిపించింది. పండుగపూట అత్తగారింట్లనో, అమ్మగారింట్లనో భార్యతో ఉండాల్సినోడు. ఏవో మనస్పర్థలు. ఆ పిల్ల తల్లిగారింట్ల, వీడు ఇక్కడ. మొగడు పెండ్లాల నడుమ దూరం పెరిగితే ఎవరి మనసు నిమ్మలంగ ఉంటది.

సుధాకర్ కూడా అట్లనే ఉండు. అందుకే వాడు పండుగనాడు కూడా రోగం బుట్టిన కొడిపిల్లోలిగ ముడుసుకుండు. అయినా వీడు అట్ల ఆలోచించడం సబబా? సుధాకర్ పరిస్థితి తాత మనసులో మెదిలింది. మనసు చివుక్కుమన్నది. చిలకా గోరింకలోలిగ ఉండాల్సినోల్లు. లేనిపోని అనుమానాలు, పంతాలు పట్టింపులు.

తాత మళ్ళీ సుధాకర్ మీద చెయ్యేసిండు.

'రేయ్ లేరా...పండుగపూట...లే...' తాత గొంతులో గారాబం.

ఇంక సుధాకర్ తప్పదన్నట్టుగా లేసిండు.

'ఏందీ తాత' సున్నితంగా విసుక్కుండు. 'లే..లేసి స్నానం చెయ్యి'.

కొడుకు లేచింది చూసి వంటింట్ల నుంచి తల్లి వచ్చింది.


'వేడి నీళ్ళు తోడింద్రా' అన్నది.


తల్లి మాటతో సుధాకర్ బల్లెపీట దిగిండు.

***

సుధాకర్ తలంటు స్నానం చేసిండు. వేడి వేడి పూరీలు తల్లి కొసరి పెడితే తిన్నడు. ఇంట్లె అటూ ఇటూ పచార్లు చేస్తుండు. మనసునిండా ఆలోచనలే. మనసు దిగులుగానే ఉంది. ఆ దిగులు మొకం మీద కొట్టొచ్చినట్టుగా కనిపిస్తనే ఉన్నది. సుధాకర్ మనసు భార్య మమత చుట్టూ తిరుగుతున్నది. మమతకు తనకూ నడుమ దూరం పెరగడానికి కారణం... సుధాకర్ ఆలోచనలు వెనక్కు మళ్ళినయ్.

సుధాకర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్. రాత్రి పగలు లేకుండా తిరుగుతుంటడు. మమత చదువుకున్నది. ఇంటిపట్టునే ఉంటది. ఉద్యోగం చేయాలనేది ఆమె కోరిక, కాని సుధాకర్‌కు ఇష్టంలేదు. ఉద్యోగం చేసే





మహిళలమీద ఒక చిన్న చూపు. అది తను స్నేహితుల ద్వారా విన్నది. అది మనసులో పెట్టుకునే 'ఉద్యోగం చేయాల్సిన పనిలేదు' అంటడు. 'మమత ఎందుకు చేయకూడదు' అని ప్రశ్నిస్తుంది.

దానికి సమాధానం సుధాకర్ దగ్గర లేదు..ఉంది...కాని బయటకు చెప్పలేడు.

ఆ వాదన ముదిరి ముదిరీ ఇద్దరి నడుమ దూరం పెరిగింది. మమత 'నేను ఉద్యోగం చేస్త. దానికి ఒప్పుకుంటేనే తిరిగి వస్త లేకుంటె నీ ఇష్టం' అని నెల కిందనే తల్లిగారింటికి పోయింది.

సుధాకర్ పంతం పట్టిండు. ఆడమనిషికి ఇంత పట్టుదలా అనుకుండు. నెల్లాల్లు ఒంటరిగానే ఉండు. సుధాకర్ తల్లి దండ్రులకు తెలిసి చెప్పబోయినా 'నేను చూసుకుంటలే' అని వారిని దూరంగా పెట్టిండు.

పండుగకు ఒక్కడే ఇంటికొచ్చిండు. అయినా వీడని ఆలోచనలు.

మనవడు పరధ్యానంగా...అటూ ఇటూ తిరగడం చూసిన తాత. 'ఒరే సుధాకరూ ఇటు రా' అని పిలిచిండు.

ఇంటి ముందు వేపచెట్టు కింద మంచంలో ఒరిగిన తాత కాడికి పోయిండు సుధాకర్.

'కూచో' అన్నడు తాత మంచంలో ఒక వైపు జరిగి.

సుధాకర్ కూసుండు.

'సుధాకరూ నీకో కథ చెప్పాలనిపిస్తుందిరా' అన్నడు తాత.

తాత ఎన్నో కథలు చెప్పిండు సుధాకర్‌కు. అవన్నీ చిన్నప్పుడు. ఇప్పుడు కూడా కథలంటే... అందులో తన మనసు బాగాలేదు.

'చిన్నప్పుడన్నీ విన్నగా తాతా ఇప్పుడెందుకులే' అన్నడు సుధాకర్.

'లేదురా ఒక కథ మిగిలిపోయింది. అదొక్కటీ చెప్పితే.. ఇక నా కత అయిపోతది' అన్నడు తాత.

ఆ మాట అంటుంటే తాత గొంతు బొంగురుబోయినట్లుగా అయ్యింది. సన్నటి పొడి దగ్గు దగ్గిండు.

తను కాదన్నా తాత వదలడు అనుకుండు సుధాకర్.

'ఇదే చివరి కథ తాత. మళ్ళీ చెపుతానంటే మాత్రం వినను' అన్నడు సుధాకర్ కరాకండిగా.

తాత సరే అన్నట్టుగా తల ఊపిండు. గొంతు సరాయించుకుండు.

''చానా ఏండ్ల కింద జరిగిన కథ' అన్నడు తాత ఉపోద్ఘాతంగా.

'చెప్పు తాతా' అన్నడు సుధాకర్.

తాత భారంగా కళ్ళు మూసుకుండు. యాదికి తెచ్చుకున్నట్టుంది.

తాత కథ చెప్పడం మొదలు పెట్టిండు.

సావిత్రికి నెలతప్పింది. మూడు నెల్ల పొట్ట. పాపులు సంబరంగా ఉన్నడు.

ఇంతకు సావిత్రి, పాపులు మొగడు పెండ్లాలేనా తాతా అనుమానంతో అడిగిండు సుధాకర్.

'అంతేగా మరి' అన్నడు తాత.

'మరి భార్య నెల తప్పితే భర్తకు సంతోషమేగా తాతా. దాంట్లె ఏముందని' సుధాకర్ తేలికగా తీసిపారేసిండు.

'సరే సరే అయితే ఇక్కన్నుంచి మొదలు బెడత కతను' అని తాత మల్లా కథందుకుండు.

***

పదహారేండ్ల పిల్ల సావిత్రి. చక్కదనాల సుక్క. సందమామసుంటి మొకం. చిదిమి దీపం పెట్టుకోవచ్చు. పాపులుతో పెండ్లైంది. అత్తగారింట్ల కాలు పెట్టింది. స్వర్గలోకమోలిగ ఉంది అత్తగారిల్లు. భర్త పాపులు నాలుగెకరాల ఆసామి. జత ఎడ్లు, ఓ ఆవు, ఓ బర్రె ఆయన ఆస్తి. సావిత్రిని కండ్లల్ల పెట్టుకుని చూసుకునేటోడు. బాయికాడ పని కానిచ్చుకుని ఊరపొద్దుగంతలనే ఇల్లు చేరేటోడు. సావిత్రి వడ్డిస్తుంటే ఆమెనే చూసుకుంట కడపార తినెటోడు. కవర కవర చీకటి పడుతుండగనే పడమటి అర్రలో దూరేటోల్లు.

పడమటి అర్ర సౌడు మిద్దె. ముందు రొండు గదుల మందం తాటాకుల సాయమాను. పొద్దూకంతల ఆ సాయమాను చూరులో ఊరపిచ్చుకలు చేరేవి. కిచ కిచ అని సందడి సందడి చేసేవి. పడమటి అర్రలో సావిత్రి మొగని చెవిలో

గుసగుసలాడేది. ఊరపిచ్చుకలు బలువు చీకటి కాంగనే నిద్దురపోయేవి. సావిత్రి గుసగుసలు మాత్రం తెల్లవార్లూ వినిపించేవి. పాపులుకు స్వర్గం కనిపించేది. పగలు లేకుండా ఉంటే బావుండేది కదా అనిపించేది. రాత్రీ పగలూ సావిత్రి గుసగుసలు అట్లనే వినాలనిపించేది. సావిత్రికీ అంతే.

పెండ్లయి ఆరు నెల్లు గడసింది. ఒకనాడు ఇద్దరాలుమొగలు తిని పడమటింట్లో దూరిండ్రు. ఆరు నెల్ల నుంచి చిలకా గోరెంకలోలిగ...లోకాన్ని మరిచి గుస గుసలాడుతున్న కొడుకు కోడండ్లను చూసి పాపులు తల్లికి గుండె మండింది. పాపులు పుట్టగానే ఆమె మొగడు పాము కరచి కాలం చేసిండు. కొడుకునే లోకంగా పెంచింది. ఇప్పుడు కొడుకు దూరమైతుండని ఆమె బెంగ. తనకు దక్కని సుఖం కోడలుకు దక్కుతుందనే అసూయ. కోడలంటే కోపం పెంచుకుంది.ఎప్పుడు సందు దొరుకుద్దా అని ఎదురుచూస్తున్నది.

'ఊర పొద్దూకంతల అర్రల దూరితే ఎట్లా? గొడ్డేమాయె, గోదైమాయె పట్టించుకోవద్దు? మొగన్ని పక్కల ఏసుకుని పండుకుంటె తెల్లారి పోద్దా' అని రాగాలు దీయడం మొదలుపెట్టింది.

పాపులు తల్లి మాటలు విని సడీ సప్పుడు లేకుంట ఉన్నడు.

సావిత్రి మనసు చివుక్కుమన్నది.

ఆనాటి నుంచి పాపులు తల్లి నోరు పెంచింది. పాపులు నోరు మూసుకుండు. సావిత్రి కలత చెందింది. అత్తా కోడళ్ళ నడుమ దూరం పెరిగింది.

***

కోడలు చేసిన పని అత్తకు నచ్చకుంట అయ్యింది. అత్త చెప్పిన మాట కోడలుకు నచ్చకుంట అయ్యింది. ఇద్దరి నడుమ పాపులు నలిగిపోతున్నడు.

ఒకరాత్రి సావిత్రి పాపులును అడిగింది.

'ఏవయా మీ అమ్మ అట్ల రాద్ధాంతం చేస్తున్నది. నోరు తెరిసి ఇదేంది అని అడగొచ్చుగా.'


పాపులు మెల్లగా జవాబు చెప్పిండు. 'నాకు నువ్వెంతో మా అమ్మ అంత. ఇద్దరూ రొండు కండ్లు. మీరిద్దరు మాటకుమాట అనుకుంటుంటే నేనేమి అనగలను'

సావిత్రి గుండె కలుక్కుమన్నది. ఉత్త పున్నానికి అత్త తనను సాధిస్తున్నా మొగడు నోరు తెరవడంలేదు. తాను ఇంక ఎవరితో చెప్పుకోవాలే. పాపులుతో ఏదో దూరం పెరిగినట్లుగా అనిపించింది. సావిత్రికి. ముభావంగా ఏదో పని చేస్తున్నది. మునుపటి గుసగుసలు లేవు. మునుపటి కళ లేదు మొఖంలో.

'బిడ్డొచ్చిన వేళ గొడ్డొచ్చిన వేళ అంటరు. నువ్వొచ్చినంక నా కొడుకు మొకంలో సంబూరం లేకుంట అయ్యింది. ఆడు గొడ్డూ గోదా పట్టించుకుంటలేడు. యవుసాయం మీద మనసు పెడత లేడు. నువ్వు ఇంటికి దీపం పెడతవనుకున్నా. మా తల్కాయకాడ దీపం పెడితివి కదనే.'

## భూమిక సొంత డబ్బింగ్

పరిశ్రమలోకి వచ్చిన ఎనిమిది సంవత్సరాల తరువాత భూమిక సొంతంగా డబ్బింగ్ చెప్పడం ప్రారంభించింది. చార్మి, మమతా మోహన్‌దాస్, నిఖిత మాదిరిగా భూమిక కూడా డబ్బింగ్ ఆర్టిస్ట్ వుండేవారు. ఈసారి మాత్రం 'మల్లెపువ్వు' అనే చిత్రానికి తానే సొంతంగా డబ్బింగ్ చెప్పింది. వి.సముద్ర దర్శకత్వంలో మురళీకృష్ణ హీరోగా, భూమిక హీరోయిన్‌గా రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదల కాబోతోంది. దీని మాతృక హిందీ. ఈ సినిమాలో తన గొంతు ఏ విధంగా వుంటుందో వినాలన్న ఆతృతతో భూమిక వుంది. తన మీద తనకు నమ్మకం కలిగిందని, ఇక నుంచి తన సినిమాలకు తానే స్వయంగా డబ్బింగ్ చెబుతానని ఆమె చెబుతోంది.



పాపులు తల్లి సావిత్రిని ఎడా పెడా వాయించింది.

ఆమె విరుచుకుపడటానికి కారణం కూడా పెద్దగా లేదు. కూరలో ఉప్పు తక్కువ కావడం వంక. అసలు కారణం కొడుకు దూరమైతుండని... కోడలు సుఖపడుతుందని.

సావిత్రి మనసు విరిగింది. తెల్లారి పెట్టే బేడా సదురుకుంది.

'మీ అమ్మ ఉండంగ నీతో సంసారం చేయలేను. తల్లో, పెండ్లామో తేల్చుకో' అని కాలు బయట పెట్టింది.

అమ్మగారింటికి పోయింది. మల్లా మళ్లి చూడలే. పాపులుకు పోయి తీసుకొచ్చుకుందామంటే తల్లి భయం. దూరం పెరిగింది. సావిత్రి అక్కడ... పాపులు ఇక్కడ... కాలం ముందుకు.

***

ఆర్నెల్లు గడిచింది. యాడాది గడిచింది.

ఎక్కడోళ్లు అక్కడ...

ఎవరి పంతాలు భయాలు వాళ్ళవే.

పాపులు చెవుల్లో సావిత్రి గుసగుసలు వినిపిస్తూనే ఉన్నయ్. ఊరపిచ్చుకలు కిలకిలా అంటుంటే సావిత్రి నవ్వినట్టుగానే ఉంటుంది. కొట్టంల ఆవుదూడ చెంగనాలు కొడుతుంటె మెడ గంటల సప్పుడులో సావిత్రి కాళ్ళ పట్టాల సప్పుడు.

పాపులు మనసులో సావిత్రి ఊసులు. మొకంలో దిగులు.

పాపులు, పరధ్యానంగానే ఇంటి ముంగల కొట్టంలో గొడ్లపేడ దీస్తుండు.

కరాకరా పొద్దెక్కుతున్నది.

తల్లి ధనధనామని కొట్టంలకొచ్చింది

'ఒరే పాపులు ఇంక అది మనకొద్దు. నువ్వు దానిమీద ఆశ పెట్టుకోకు. దానికి నీ మీద మతిలేదు. అది నీకు సంసారం చేయదు.' పటపట మాట్లాడింది.

పేడను తీస్తున్న పాపులు తల్లి మాటలకు తల తిప్పి చూసిండు.

'వింటున్నవా అది ఎంతకు తెగించిందో. పసుపుతాడు కట్టిన నువ్వున్నవు. అవన్నీ మరిచిపోయి అది అమ్మగారింట్ల ఎవనితోనే కులుకుతుందంట.' పాపులు చెవుల్లో ఆ మాటలు. సూటిగా గుండెకు తగిలినయ్.

'అమ్మా ఎంత నీకు ఇష్టం లేకపోతే మాత్రం ఇంతగా చెప్పాల్నా.'బాధగా అన్నడు పాపులు. గట్టిగా చెపితే తల్లి ఎక్కడ బాధపడతదో అన్నట్టుగా.

'నీకు శరం లేదు, రోషం లేదు. లోకం కోడై కూస్తున్నది. అయినా నువ్వు నమ్ముకుంటే నీ కర్మ' చెప్పాల్సింది చెప్పి వచ్చినంత వేగంగా వెనక్కు మళ్ళింది పాపులు తల్లి.

పాపులు మనసు కలత చెందింది. నలిగి పోయిండు.

***

పొద్దూకంతల గొడ్లను కట్టేసిండు. పండుకునే యాళ్ళకు పాపులు తల్లి కొట్టంలకొచ్చి గాట్లె మేతను సగేసింది. బర్రెపడ్డ మోర పైకెత్తి అరుస్తున్నది. రొండు దినాలాయె. ఎదకొచ్చినట్టుంది. పశానతుగా చూసింది పాపులు తల్లి. ఇంట్లకొచ్చి కొడుకుతో చెప్పింది.

'బర్రెపడ్డ తీగలు పెడుతుంది కొడుకా. ఎదకొచ్చినట్టుంది. పొద్దున్నా ఆ దొరాయిన దున్నపోతు కాడికి తీస్కపోరాదూ.' పాపులు సరే అన్నడు.

ఊరపిచ్చుకల సవ్వడికి సావిత్రి యాదికొచ్చింది

పాపులుకు. ఎన్నాల్లయ్యింది సావిత్రి తల్లిగారింటికి పోయి. రొండేండ్లు కదూ...పొద్దున్న లేసి పేడకళ్ళు తీసిండు పాపులు. కాళ్ళు మొకం కడుక్కుండు. బర్రెపడ్డను తోలుకుని మార్వాక బాట పట్టిండు. బర్రెపడ్డ మోర పైకెత్తి అరుస్తున్నది. దున్నపోతును దాటియ్యలే. ఏడాది తిరగకముందే జున్నుపాలు తాగాలె. వెన్నముద్ద తినాలె. తియ్యటి ఆలోచనలు పాపులు మదినిండా.

బర్రెపడ్డ ఆలోచనలతో పాపులు నల్లేనే ఎక్కిండు.

ఎదురుగా సావిత్రి. వెనుక ఆమె తండ్రి. ఎప్పుడో తెల్లారగట్ల లేచి బాటపట్టినట్టుంది. ఇంతకాలానికి రాబుద్ధి అయ్యిందేమో. సావిత్రిని చూడగానే పాపులు మనసు పులకించింది. గుండే ఘల్లుమన్నది. చెవిలో గుసగుసలు.

సావిత్రి ఎదురుగా నిలబడ్డది. దగ్గరగా చాలా దగ్గరగా. అదే మొకం చందమామోలిగ. అదే నవ్వు చుక్కలు తెగిపడ్డట్టుగా. నిండుగా నున్నగా మరింత అందం.

'ఎక్కడికయ్యా పాపులు'. సావిత్రి తండ్రి పలకరించిండు.

'బాగున్నవా' అన్నడు. ఇంకేదో మాట్లాడబోయి తొందరగా దా అన్నడు.

సావిత్రి పాపుల్ను కండ్ల నిండుగా చూసుకుంది. కండ్లల్లో ఎన్నో భావాలు. కండ్లతో నవ్వింది. నోటితో నవ్వింది. తొందరగా రా అన్నది.

బర్రెపడ్డ వెనుకంగ పాపులు కదిలిండు.

వెనక్కి మళ్ళి చూస్తే ఏనె దిగుతున్న సావిత్రి. తన ఇంటికి ...తన గూటికి..తన బతుకులోకి.. పాపులు మొకంలో సంబూరం.

వడివడిగా అడుగులు వేసిండు.

***

బర్రెపడ్డను కొట్టంల కట్టేసి ఇంట్లకొచ్చిండు పాపులు.

తల్లి, సావిత్రి, ఆమె తండ్రి అంతకు ముందే మాట్లాడుకున్నట్లుంది. తల్లి మొకం చిటపటలాడు తున్నది.

సావిత్రి తండ్రి చుట్ట కాల్చుతుండు.

పాపులు కాళ్ళు చేతులు కడుక్కుండు. తల్లి లేచి అన్నం పెట్టింది.

'మామ, సావిత్రి తిన్నారామ్మా' అడిగిండు.

సావిత్రికి ఆ మాట వినిపించింది. చాలు...ఇంక మనిషి మారలే అనుకుంది. సావిత్రి తండ్రికి వినిపించింది. అల్లుని పాపురం తగ్గలే అనుకుండు.

'తిన్నం నాయినా నువ్వు తిను' అన్నడు.

పాపులు తిని పాక కింద కూసుండు. కాళ్ళ మంచంల సావిత్రి తండ్రి కూసుండు. పాపులు తల్లి గడపట్ల కూసుంది.

సావిత్రి గోడ వారకు కూసుంది. 'ఎంతైనా మొగడు పెండ్లాలు. ఎంత నా బిడ్డ అయినా తలంబ్రాలు పడ్డనాడే అది నీ బిడ్డ'. పాపులు తల్లితో అన్నడు సావిత్రి తండ్రి.

'నువ్వంటున్నవామాట దానికుందా' ముక్కు చీదింది పాపులు తల్లి. 'చిన్నపిల్ల తప్పో, ఒప్పో కడుపుల పెట్టుకోరి,' రొండు చేతులు జోడించిండు సావిత్రి తండ్రి.

పాపులు మౌనంగా ఉండు. పాపులు తల్లి నిమ్మళపడ్డది.

'దానంతట అది పోయింది. అదే వొచ్చింది' అన్నది.

కోడలే దిగివచ్చిందని ఆమె సంతృప్తి.

ఇక తను ఉండాల్సిన పని లేదనుకుండు సావిత్రి తండ్రి. బిడ్డను అప్పగించిండు. ఇక వెళ్ళడమే మేలు అనుకుండు. 'నేను వస్త. నా బిడ్డను మీ చేతుల పెట్టిన' అని వియ్యపురాలి చేతులు పట్టుకుండు, కండ్లొత్తుకుండు సావిత్రి తండ్రి. వచ్చిన పని అయ్యిందన్నట్లుగా లేసిండు. సావిత్రి తల నిమిరిండు. అల్లుని భుజం మీద చెయ్యేసిండు. కాళ్ళకు చెప్పులేసుకుండు....

***

ఊర పొద్దూకంతల గొడ్లను తోలుకుని ఇంటికొచ్చిండు పాపులు. కట్టేసి మేతేసిండు. అప్పటికే తల్లి గయ్యిన లేస్తున్నది.

''ఒరే పాపులు, దాని సంగతి చూసినవా, ఎవనితోనే కడుపు చేయించుకుని వచ్చింది. సిగ్గులేనిది'' అగ్గిమీద గుగ్గిలమైతుంది.

సావిత్రి బెల్లం కొట్టిన రాయోలిగ సాయమాను కింద కూసుంది.

'అది ఇట్ల అటిటు దిరుగుతుంటె చూసిన. దాని పొట్ట చూస్తెనే అనుమానమెచ్చింది. దాని అడవ తిరుగుళ్ళు విన్నదాన్నైతి. ఇట్లాంటి దాంతోని సంసారం చేస్తావురా' కొడుకును నిలదీస్తున్నది తల్లి.

పాపులు సడీ సప్పుడు లేకుంట కాళ్ళు చేతులు కడుక్కుండు. కంచంల అన్నం పెట్టుకుని తిన్నడు. తల్లి ఆగకుండా కొడుకును కోడలును కలిపి తిడతనే ఉంది.

'నడువ్. నాయింట్లె ఇంకొక్క ఘడియ ఉన్నవంటె కాల్చి బొగ్గులు చేస్త' అంటుంది.

సావిత్రి ఉలుకూ పలుకూ లేకుంట ఉన్నది. వినీ వినీ పాపులు చెవులు గుయ్యిమంటున్నయ్. పాపులుకు కోపం... రొండేండ్లు అణగబట్టిన కోపం...పెటేల్మన్నది.

'అమ్మా అది మంచిదో చెడ్డదో సంసారం చేయాల్సింది నేను. మధ్యలో ఊకెనే రాద్ధాంతం చేయకు'. కరుకుగా అన్నడు పాపులు.

కొడుకు మాటలు కారం పూసినట్టుగా అనిపించింది తల్లికి.

'మొగోనివి కావుర, సిగ్గులేదుర' అన్నది పాపులు తల్లి.

'అమ్మా బర్రెపడ్డ ఎదకొచ్చింది, దొరోరి దున్నపోతుతో దాటిచ్చినం. రేపు ఈంతది. మనం జున్ను తాగుతం. పాలు తాగుతం. పెరుగు తింటం. వెన్నముద్దలు తింటం. అదీ మన బర్రెనే. దొరోరి దున్నపోతు యాదికొస్తదా. ఏ దొడ్లె కడితేందమ్మా మన దొడ్లె ఈంతె సాలదా'.

పాపులులో కట్టలు తెంచుకున్న కోపం.

పాపులు తల్లి నోరు మూతపడ్డది.

సావిత్రి మనసులో పాపులు కొండంత ఎదిగిన మనిషోలిగ అనిపించిండు.

ఊరపిచ్చుకలు కిచకిచలాడుతూనే ఉన్నయి. సాయమాను సూరులో కిలకిలలు. పడమటర్ర తలపు బేడెం పడ్డది.

పాపులు మౌనంగా నవ్వుతూ సావిత్రిని చేతుల్లోకి తీసుకుండు. సావిత్రి కుంచించుకు పోయినట్లైంది.

'ఏంది సావిత్రీ' పాపులు గొంతులో ప్రేమ. కండ్లల్లో ఆరాధన.

సావిత్రి గొంతు తెరిసింది. 'మీ అమ్మ చెప్పింది నిజమే. మూడో నెల'.

పాపులు ఒక్కక్షణం ఆగిండు. కిలకిలా నవ్విండు. సావిత్రిని కౌగిట్లో బంధించిండు. బయట నుంచి ఊరపిచ్చుకల కిల కిలలు. పాపులు చెవుల్లో సావిత్రి గుసగుసలు.

***

కథ సొంతం అయిపోయినంక తాత సుట్ట ముట్టించిండు. గుండెల నిండా పొగ పీల్చిండు. మనవడి దిక్కు చూసిండు. కథలో మనవడికి ఏదో తాకినట్టుగా అనిపించింది. అంటే తన కల ఫలించినట్టే అనుకుండు.

సుధాకర్ మొకంలో ఏదో అనుమానం. 'తాత కథ ఎందుకు చెప్పినవో అర్థమైంది. కాని అది నిజమా చెప్పు. మరీ పాపులంత గొప్ప మనుసు లుంటారా ఈ కాలంల'. సుధాకర్ తాత కండ్లలోకి చూస్తూ అడిగిండు.

తాత కండ్లల్లో తడి. మొకంలో గర్వం.

'నిజమేరా. పచ్చి నిజం. ఈ కథ జరిగి యోభై ఏండ్లయ్యింది' అన్నడు.

'ఎట్ల నమ్మేది తాతా'. సుధాకర్ తాతను ఇరుకుట్ల పెట్టిన అనుకున్నడు.

తాత గొంతు మరోసారి సరాయించుకుని చెప్పిండు.

'నువ్వు నమ్మాలె. ఎందుకంటె ఆ పాపులును నేను. సావిత్రి నా భార్య. సావిత్రి కడుపుల పుట్టినోడే నీ తండ్రి'.

సుధాకర్‌కు తల తిరిగినట్లుగా అయ్యింది. మాట పడిపోయింది.

'ఇది నీకు చెప్పిన చివరి కత. నా కత. ఆ కత చెప్పాల్సిన అవసరం రాకూడదనుకున్న. కాని నీకు చెప్పాల్సి వచ్చింది రా' అన్నడు తాత.

తాత మనసు నిండా పదిహేనేండ్ల కింద చచ్చిపోయిన భార్య సావిత్రి.

***

సుధాకర్ హడావుడిగా ఇంట్లకు పోయిండు. బ్యాగు సదురుకుండు.

తల్లి చూసి 'ఏందిరా ఇప్పుడు ఎక్కడికి తయారై తున్నవ్. పండుగపూట' అన్నది.

'మమతకాడికి....'

*